# తిరుగు ప్రయాణం

సీతారాముడు - తను కవులుకు తీసుకొన్న వెంకట్రత్నంగారి తూర్పు పొలంలో మెరక దుక్కిపని ముగించుకొని, భుజంమీది కాడితో సహా కరణం గారి పాత ఇంటికి దారి తీశాడు. పొద్దుగుంకుతున్నా వడగాలి తగ్గలేదు. కరణం గారిల్లు తన ఇంటి పొంతలోనే వున్నా చుట్టు దారిపట్టి పడమటి వీధిగుండా నడుస్తున్నాడు. తనవలెనే తలిదండ్రులులేని కరణంగారి మేనల్లుడు అనంతం, తనతోపాటు వీధిబడిలో చదివి, యిక సాగక అత్తపోరునుండి తప్పించుకు తిరుగుతూ రామబ్రహ్మంగారి వద్ద ఫిడేలు నేర్చుకొన్నాడు. హరికథలకు, పెద్ద గుడిలో భజన బృందాలకు వాయిస్తాడు. ఎవరూ పిలవకపోతే యింటి సందు వరండాలో సాధన చేస్తూ కూచుంటాడు. పిలుపొస్తే భోజనానికి పోతాడు. రాకపోతే ఫిడేలు పక్కలో పెట్టుకొని నిద్రపోతాడు. సీతారాముడు, తన సవతి తల్లి చూడకుండా చీకటి పడ్డాక, కాచిన పాలు చెంబులో పోసుకొని వారానికి రెండు సార్లయినా స్నేహితుడి పస్తుల్ని దాటవేస్తుంటాడు. దిబ్బమీది జామ కాయలు, పొలం గట్టుమీది రామములక్కాయలు ఒక్కోసారి తను దుక్కిమడికి తీసుకుపోయే తాబేటి కుండలో చల్లపోసుకొని నేస్తందగ్గిర వదిలిపోతాడు. ఇవ్వాళ వడదెబ్బలో అనంతం తిన్నాడో లేదో తెలియదు. సీతారాముడికి ఆ విషయం నిజానికి తలపుకు రాలేదు. తన మనోవేదన చెప్పుకోడానికి వచ్చాడు. వచ్చి కొయ్యస్తంభానికి ఆనుకొని తల గుడ్డతో ముఖం తుడుచుకొన్నాడు.

అతన్ని చూడగానే అనంతం ఫిడేలు ఆపేశాడు. కమాను తీసి అవల పెట్టి సీతారాముడికి మంచినీళ్ళు అందించాడు.

సీతారాముడు తల ఆడిస్తూ—

"మళ్ళీ యివ్వాళ పొద్దున పెద్ద రచ్చ చేసింది. చేసుకొంటావా లేదా? అని నిలదీస్తున్నది. సంబంధం కుదిర్చింది. పీకమీద కూచొన్నది" అని తన సవతి తల్లి చేస్తున్న వత్తిడిని గురించి టూకీగా అన్నాడు.

అనంతానికి తను అప్పుడే ఆపిన రాగధ్వని చెవుల్లో మృదువుగా ప్రతిధ్వనిస్తుండగా, అతని అమాయకపు ముఖంలోకి సేరుగా చూసి మెల్లగా చెబుతున్నాడు:

"పెళ్ళిచేసుకొన్నావా నరకంలో పడిపోతావ్ రావుఁడూ! మనిద్దరం బందరు వెళ్ళిపోదాం. లేదా బ్రహ్మంగారి మఠం చేరుకుందాం. నీకు మద్దెల నేర్పుతాను. మనకు రోజులు జరిగిపోతాయిరా బాబూ!"

"మధ్యలో ఈ కవులొకటి తీసుకొన్నాను గదా"

"ఏమైంది? వదిలేసిపోదాం."

అనంతం అంత తేలిగ్గా అన్న మాటకు సీతారాముడికి ఒళ్ళు జలదరించింది. ఇద్దరూ మౌనంగా కూచొన్నారు ఒక గడియసేపు అనంతం కమాను అందుకొని మళ్ళీ రాగాలాపన ప్రారంభించి హఠాత్తుగా ఆపివేసి—

"రావుఁడూ-నీకు రామాయణగాథంతా తెలుసా?" అని చీకట్లో స్నేహితుడి వంక దృష్టి సారించాడు.

"తెలీదుగదూ? విను, గాంధీగారికన్నా ముందు సత్యాగ్రహం చేసినవాడు భరతుడు!"

"భరతుడా?"

"అవును. చిత్రకూటంలో రాముఁడు వనవాస శ్రమకు ఆగిపోయాడు. భరతుడు మందీమార్బలంతో వచ్చి అన్నను తిరిగి అయోధ్యకు రమ్మని అర్థించాడు. ఆయన మన్నించలేదు. బ్రతిమిలాడాడు. అన్న ససేమిరా అన్నాడు. ఇక భరతుడు సత్యాగ్రహం ప్రారంభించాడు. చివరకు రాముఁడు తన పాదుకల్ని పరిగ్రహించమని తమ్ముడికి నచ్చజెప్పి పంపిస్తాడు. ఆ పాదుకల పేరుతోనే భరతుడు రాజ్యం ఏలాడు. నువ్వుగూడా అట్లాంటి సత్యాగ్రహం చేయాలిరా!"

సీతారాముడు అన్నీ ఆలకించాడు. సవతి తల్లి తనను పెంచిన రీతిని మననం చేసుకొన్నాడు. కళ్ళనిప్పులు చెరిగే ఆమె ఆకృతి అతని ముందు నిలిచింది. బదులుచెప్పకుండా లేచిపోయాడు. చీకట్లో అనంతం ఫిడేలు మ్రోగింది.

* * *

సీతారాముడి సత్యాగ్రహం వర్ధనమ్మను వంచలేదు. ఆ మరుసటి నెల లోనే పెళ్ళి పీటలమీద తలవంచి కూచున్న దుర్గ మెడలో తాళి గట్టాడు. పెళ్ళయిన వారంరోజులకు అనంతాన్ని చూద్దామని గుండె దిటువు చేసుకొని బయలుదేరి కరణంగారి వరండా చేరుకొన్నాడు. అక్కడ అనంతం లేడు, అతని ఫిడేలూ లేదు. అతను పడుకొనే నులక మంచం గోడకానించి వుంది. అతను చెప్పులు పెట్టుకొనే మూల తన తాబేలు నీళ్ళకుండ దుమ్ముకొట్టుకొని దీనంగా పడివున్నది. సీతారాముడు అక్కడే కూలబడిపోయాడు.

*　　　*　　　*

దుర్గ యిప్పుడు తన తల్లిగా మారింది. తనను లాలిస్తున్న మధుర క్షణాల్లో, కామం మోహం లేని నిస్సహాయుడివలె ఆమె ఒడిలో తలదూర్చి ఏడ్చే వాడు. అనంతం స్మృతి విడనాడక అతని మాటలు మననం చేసుకొంటూ, ఆమె ముఖమెప్పుడూ నిండుగా కాముకుడిగా వీక్షించలేక పోయేవాడు. తల్లిలేని తనకు తల్లి ప్రేమామృత వ్యాక్యాల్ని యిన్నాళ్ళూ పంచి యిచ్చి, వెనుదిరిగి చూడ కుండా, తన మాటను వినలేదనే కోపంతోనో- ఇక తన అవసరం తీరిపోయిం దనో దుర్గను తన స్థానంలో నిలిపిపోయాడా అనంతం?

దుర్గ అడిగినప్పుడల్లా ఏదో చెప్పాలని అభిలషించినా మాటలు పెగిలి రాక, భావాలు పొందికగా కుదరక, చెబితే యింకా మిగిలేది ఏదీలేదనే అనూహ్య భయాందోళనతోనో, లక్ష్మణుడి కథ - అనంతం ఒకసారి తనకు బోధించినది - తనలోనే మననం చేసుకొనేవాడు.

వినుకొండమీద సీతాన్వేషణ చేస్తున్న రామలక్ష్మణులకు చావుబతుకుల్లో వున్న జటాయువు కన్పించి, సీతాపహరణం గురించీ, పుష్పక విమానం పయ నించి పోయిన దిక్కుల గురించీ చెప్పి ప్రాణాలు విడిచాడు. జటాయువుకు దహన సంస్కారాలు ముగించి, సోదరులు దక్షిణాపథంగా బయలుదేరారు. దారిలో సీతాదేవి కింద పడవేసిన కంఠాభరణాలు లభించాయి.

"ఇవి మీ వదినెగారివేనా?" అని సోదరుణ్ణి శ్రీరాముడు ప్రశ్నించాడు.

"ఆమె పాదారవిందాల్నే దర్శించాను గాని ముఖమెత్తి చూడనివాణ్ణి. నేనెట్లా గుర్తించగలను?'' అని లక్ష్మణుడు కన్నీళ్ళతో సమాధానం చెప్పాడు. ఈ కథ విన్ననాడు తన కనుకొలకులు నిండినవి. ఈనాడూ నిండినవి. తన భార్య

దుర్గ కాదు-సీతాదేవి. తను సీతారాముడుగాదు - లక్ష్మణస్వామి. ఏమైనా వాళ్ళ అన్యోన్యత చెడలేదుగాని వర్ధనమ్మకు కడుపు మండుతున్నది.

ఏరువాక పున్నమికి వెంకటరత్నంగారి పొలం కవులు మళ్ళీ మలిసాలుకు తీసుకొని దుర్గతో అన్నాడు - ''అనంతం వద్దన్నాడు. కాని, వేరే మార్గంలేదు.''

"ఏం భయంలేదు. నేను లేనా? మనిద్దరం కవులు చేసుకొందాం, ఇంకో పాడిగేదెను కొనుక్కొందాం!'' అని అభయ మిచ్చింది దుర్గ. ఆ మరునాడు అరక కట్టి పొలంవేపు బయలుదేరుతుండగా వర్ధనమ్మ లంఖినీ రాక్షసివలె విరుచుకు పడ్డది. తన చెవిన వేయకుండా అప్పుడే పెళ్ళాం చీర చెంగులో చేరాడు. వెంకట్రత్తంగారి కవులు వద్దన్నది. అత్తాకోడళ్ళకు మాటా మాటా పెరిగింది. సీతారాముడు అటుపోగానే మారుడత్త చేతిలో బాగా దెబ్బలు తిన్నది దుర్గ. పొలంకి అన్నం రాలేదని మధ్యాహ్నానికి యింటికి వచ్చి చూశాడు. ముఖమంతా గాట్లుపడి, శిరోజాలు విడిపోయి, ఒళ్ళు హూనం అయి - దుర్గ పడుకొని వున్నది.

''ఈ యిల్లు నా పేర వుందిరా! ఆ పుల్లడి గుంట పొలం నా పుట్టింటి వాళ్ళిచ్చింది, జాగర్త!'' అని వర్ధనమ్మ విరుచుకుపడి, తాము చేసిన తప్పేమిటో చెప్పలేదు. సీతారాముడికి ఏమీ తోచలేదు. ముంతెడు నీళ్ళు తెచ్చి దుర్గకు అందించాడు. సేదతీర్చి చెంతన కూలబడ్డాడు. తను కుదిర్చిన మనువు. బలవంతం చేసి తన మెడ వంచింది. మొదట్లో దుర్గను అక్కున చేర్చుకొన్నది. ఇప్పుడేమయిందని? ఎందుకీ కక్ష? ప్రాణికి దుఃఖం కూర్చి తన కెవరున్నారని యీ సాధింపు? సంసార విష వలయంలో వేలుబెట్టి మోసపోవద్దని అనంతం యిందుకేనా పదే పదే బోధించింది? ప్రేమ, రక్షణ, ఆప్యాయత కరువైన యీ దుష్ట పరిసరాల్నించి దుర్గను తను కాపాడగలడా? దుర్గకు తండ్రి లేడు. తల్లి మెత్తటి ఒడిలో ఆమెకు రక్షణ వుంది-తనవద్ద గాదు. అనంతం, అనంతం-నీ మాట వినక నిన్ను, నీ నిక్షేపాన్ని కాలదన్నుకొన్నాను!

నారుమడి ఏపుగా పెరిగి, బురదదుక్కితో పదునుకొచ్చిన చేను వరి నాటుకు తయారుగా వుంది. నాటుకూలీలు దొరకక సీతారాముడు పల్లెచుట్టూ తిరిగి, మనుషుల్ని పోగుజేసి చేనుకు పంపి - చల్లన్నం కావిడికి యింటికి తిరిగి వస్తూండగా దారిలో మల్లన్న మూగి కూతురు కమల తన కోసం పరుగున వస్తూ ఆపి, మూగసౌజ్ఞలతో ముఖంలోని ఆవేదనను భాషగా మార్చి ఏదో చెబుతున్నది.

తన దుర్గకు యీ మూగపిల్ల అప్పురాలు. సీతారాముడు ఆదరాబాదరాగా ఇంటికి పరుగు తీశాడు. దుర్గ తల చిట్లివున్నది కేశాలను దాటి రక్తధార బుగ్గలమీదికి పాకుతున్నది. వర్దనమ్మ రోకలిదెబ్బకు సొమ్మసిలి కూలిన కోడలు మాట్లాడటం లేదు. ఇంటిముందు పోగైన గుంపు మౌనంగా నిలబడ్డారు. కమల తల్లి వచ్చి పాతగుడ్డలు కాల్చి తలకు కట్టు కట్టింది. కమల విసురుతూ, కనుకొలకులు తుడుచుకొంటూ దుర్గ జుట్టును సవరిస్తున్నది. నాట్ల సంగతి మరిచిపోయి, సీతారాముడు మల్లన్న దున్నపోతుల బండిని తెచ్చాడు. ఆ సాయంత్రమే దుర్గను ఆమె తల్లివద్దకుచేర్చి మరునాడు తెలతెల వారుతూండగా మల్లన్న ముంగిట్లో బండి తాళ్ళు విప్పాడు. ఆ తరవాత సీతారాముడు గ్రామంలో ఎవరికీ కన్పించ లేదు. సీతయ్య సన్యాసుల్లో కలిసిపోయాడన్నారందరూ.

* * *

మిట్టమధ్యాహ్నానికి యాచనాకార్యక్రమం ముగించుకొనివచ్చే బిచ్చగాళ్లూ, సన్యాసులూ బైరాగుల గుంపుతో కిటకిటలాడే దండయ్యగారి సత్రపు భారీ వరండా యీ పొద్దు నిర్మానుష్యంగా వుంది. బిచ్చగాళ్ళయితే మచ్చుకైనా కానరావటంలేదు. కాషాయవస్త్రాల బైరాగులు సత్రం మధ్య హాలులో ఒదిగి ఒదిగి కూచొన్నారు. ఏక తారల మీటతో, శివానందలహరి భజన శ్లోకాలు వినిపించటం లేదు. ప్రహరిగోడ కీవలగా వున్న జంట వటవృక్షాలమీది పక్షి సమూహం గూడా భయంతో నిశ్శబ్దంగా వున్నట్లున్నది. గంట క్రితం పడిన నాలుగు వానచినుకుల తర్వాత గాలి గూడా స్తంభించిపోయినట్లుంది. పట్నంలో దౌర్జన్యకాండ లాగానే, అప్పటిదాకా వీచిన వడగాలిగూడా ఎవరో మూర్ఖులకు లొంగి, ఆజ్ఞతో ఆగినట్లుగా అయింది.

బైరాగి సీతయ్య కడుపులో కాళ్లు ముడుచుకొని సత్రం మధ్య నడవ గోడకు చేరబడివున్నాడు. ముఖాన విభూతిరేకలు లేవు. పక్కన ఏకతార లేదు. జోలిలో దాచిన కమండలం దైన్యమైన చూపులు చూస్తున్నది.

పసిపిల్లల్ని ఎత్తుకుపోయి బిచ్చగాళ్లు అమ్మివేస్తున్నారని పట్నంలో పుకార్లు బయలుదేరిననాడే ఒక వృద్ధుణ్ణి రాళ్ళతో కొట్టి దారుణంగా చంపివేశారు. నల్లిని దాచిన పుణ్యానికి మంచానికి దెబ్బలు పడ్డట్లుగా బిచ్చగాళ్ళను సత్రంలో చేర్చిన బైరాగులు గూడా యీ బెడదలో పడ్డారు. పలిత కేశాలు లేని కాషాయాం

బరధారులిద్దరూ సత్రం చెరువులో నీరులేక శివాలయం బావిలో స్నానమాడుతుంటే కాళ్లు విరగదన్ని పళ్ళెంలో పడదోశారు. పురపాలక సంఘంవారి చెత్త బళ్ళలో శవాల్ని పారేయించిన పోలీసులు గూడా నిజానిజాల్ని విద్వేష దౌర్జన్య వికారంతో వూగిసలాడుతున్న గుంపులకు విడమరచి చెప్పలేదు. జడ్జీల బదిలీలను రాద్ధాంతసిద్ధాంతంగా మార్చి రాజకీయదుమారాలను లేపిన వకీళ్ళసంఘాలు, పౌరహక్కుల సమాజాలు, బడుగు జీవుల హీన జీవితాన్ని పదేపదే వల్లించే రాజకీయ పక్షాలూ - ఎవరూ జనాభా లెక్కకెక్కని ఈ నిర్భాగ్యుల దారుణ మరణాలను గూర్చి పట్టించుకొన్నట్లు లేదు.

జీవితంతో రోసి, యవ్వనపు కలల్ని త్యజించి, లోకంలోని లౌకిక కుతంత్రాల నుండి దూరంగా పారిపోయి, కాషాయ గుడ్డల రక్షణతో అయిదేళ్ళు అన్వేషణ సాగించిన సీతారాముడికి హరిద్వారంలో అనంతం కనబడ్డాడు. గుర్తుపట్టకపోయినా ఫిడేలు కమాను పట్టి యిచ్చినప్పుడు, కళ్ళు చెమర్చి చేతులు జోడించినప్పుడు, పోయిన నిధి తిరిగి లభించటం వరప్రసాదమని భావించినప్పుడు, గాలివానలో వూగుతున్న వాడికి గాలిగోపురం ఆశ్రయమిస్తుందని-ఆశతో, మాటలు రాక నిలబడి నిరీక్షిస్తున్నప్పుడు, "నువ్వెందుకు వచ్చావు? దుర్గ నీకోసం చూస్తున్నది. తిరిగిపో. నా గురించి చూడకు. పదేళ్ళ తర్వాత వస్తాలే" అని గురువాజ్ఞ వెలువడినప్పుడు, సీతారాముడికి దుర్గ తిరిగి స్మృతికి వచ్చింది. ఆ సేతు హిమాచల పర్యంతం సాగిన తన సంచార మార్గంలో ఎక్కడా వినిపించని మాట. ఎవరూ సానుభూతితో పలకని పేరు దుర్గ - దుర్గ. ఎప్పుడూ హస్తాలు ముకుళించి అర్థించని గోవు వంటి బాల్యస్నేహితుడి ముందు మళ్ళీ ముకుళిత హస్తాలతో, వణికిపోతున్న కాళ్ళను సరిపెట్టుకోలేక కూలబడి రుద్ధమైన కంఠంతో ఆర్తి తెరతెరలుగా వెడలి వస్తూంటే తడబడుతూ తిరిగి ప్రశ్నించాడు

"ఇన్నేళ్లూ నీ కోసం వెతికాను. నీవు లేకుండా నేనెక్కడికిపోను? నాతో రావా? ఎందుకు పదేళ్ళ గడువు? నిజమేనా? పదేళ్ళా?"

మళ్ళీ అదేమాట - "నీ కోసం దుర్గ వున్నది. నాకెవరూ లేరు. ఆ ప్రాణిని ఎందుకు హింసిస్తావు రావుడూ? యిప్పుడే బయలుదేరు పో. నేను మళ్ళీకలుస్తాను. నా మాట నమ్ము. పో!"

ఎందు కబద్ధమాడుతున్నాడు? దూషణ భూషణ తిరస్కారాలు ఏవీ అంటని యీ యోగి కూడా తనతో అసత్యం పలకటమా? నిజంగా వస్తాడా? తను యోగిగా వుండి తనను భోగిని కమ్మంటున్న దెందుకు? రొట్టెలు తినమని తన ముందు వుంచి కమండలంలో గంగాజలం తీసుకురాబోయాడు తను వారిస్తున్నా. ఆ నీళ్ళు తన కమండలంలో పోసి అదృశ్యమయినాడు. గత్యంతరం లేక సీతారాముడు తిరోన్ముఖుడైనాడు. రైళ్ళు ఎక్కుతూ, దిగుతూ తన ఏక తారను ఎవరికో దానంచేసి, వేదనా పశ్చాత్తాపం వెంటాడుతుండగా పక్షం రోజులు పయనించి దాదాపు గమ్యానికి చేరువుగా వచ్చాడు. ఈ పట్నం తనకు కొత్త గాదు. ఎరువులకు, విత్తనాలకు ఎన్నో సార్లు వచ్చాడు. తనకి గడ్డం కాషాయాంబరాలే లేకుంటే-యీ పాటికి దుర్గను చేరేవాడు. మధ్యలో మాయదారి చిక్కులదారి సత్రంలో రెండు రోజుల ఆకలితో, కల వలె కలిసిన అనంతం మాటలను స్మరించుకుంటూ, మాట చెప్పకుండా మాటుగా దాటవేసి అయిదేళ్ళుగా దుర్గ కన్నీటిని తుడవలేని తను, ఈ క్షణాన గూడా తన ప్రాణాన్నే వదిలంగా ఎంచుకొంటున్నాడా? వీళ్ళ నెదిరించి తన దుర్గ కోసం పరుగిడిపోలేడా? చీకటి వడ్డది. చాలామంది బైరాగులు సత్రంనుండి ఊరి పొలిమేరలు దాటుకొన్నారు.

సత్రంలో సీతారాముడూ యింకో బైరాగీ మిగిలిపోయారు. నిరీక్షించి, ఉపవశించి, ప్రార్థించి, జీవశక్తి లేక - ఒక్క ఆశతోనే ముందడుగు వేయ బోతుండగా బయట జీపు నిల్పిన శబ్దం తోచింది. ఒక వ్యక్తి అడుగులో అడుగు వేసుకొంటూ తన దగ్గిరగా వచ్చాడు. సీతారాముడు నిర్లిప్తంగా అతని వంక చూశాడు.

"మీకేం భయంలేదు....చూడండి బైరాగులూ, భయంలేదు. మిమ్మల్ని.... ఊరు బైటకు చేరుస్తాను" అంటున్నాడు.

బైరాగులు మాట్లాడలేదు. చీకట్లో వాళ్ళ కళ్ళు మాత్రం మసక మెరుపుతో కదిలినట్లు తోస్తున్నవి.

"ఈ పాతగుడ్డలు కట్టుకోండి - మిమ్మల్నెవరూ గుర్తుపట్టరు. నాతో రండి - మీకు డబ్బిస్తాను, ఒక చిన్న పని మాత్రం చేయాలి."

బైరాగులు వస్త్రాలు అందుకొని అతని వెంటనే జీపు వెనుకకు పోయారు. స్మశానానికి వెనుక దిశగా పాత బియ్యం మిల్లు. అల్లంత దూరంలోనే శ్మశానం. జీపు నేరుగా మిల్లు వెనుక భాగానికి చేరి ఆగిపోయింది. గుట్టగా పడివున్న వడ్ల పొట్టు, పనికిరాని పాత పనిముట్లు ఆ వ్యక్తి ఆగి మళ్ళీ చెబుతున్నాడు:

"మీవంటి అభాగ్యురాలు-ఎవరో బిచ్చగత్తె.... ఆకలితోనో, భయంతోనో ఇక్కడ చచ్చిపోయింది. పడివున్న దాన్ని నేనే చూశాను. రెండో కంటికి తెలియదు. పోలీసులకు తెలిస్తే పెద్ద గొడవ అవుతుంది. గప్‌చిప్‌గా శ్మశానంలో పాతి పెడితే నరమానవుడికి తెలీదు. యిదిగో.... ఈ డబ్బు మీకు...."

ఆమె చీర చెంగు ముఖానికి కప్పివుంది. చీకట్లో మానవాకారం తప్పితే కనిపిస్తున్న దేమీ లేదు. శ్మశానంలో సగం గొయ్యి తవ్వివుంది. సీతారాముడు దిగి యింకొంత తవ్వి మట్టి పైకి అందిస్తున్నాడు అలసటకు పైకి వచ్చి "ఇక చాలు" అన్నాడు. దూరంనుంచి నక్కలు అరుస్తున్నాయ్. మధ్య మధ్య ఆ వ్యక్తి చీకట్లో టార్చిలైటు వేసి చూపుతున్నాడు. రెండో బైరాగి - "ఊహూఁ" అనుకుంటూ తను తవ్వసాగాడు.

ఇంకో ఇరవై నిమిషాల నిశ్శబ్దంలో తవ్వుతున్న పార తప్‌తప్ శబ్దం పైకెత్తుతున్న తడిపొడి మట్టి కదలిక సన్నగా ప్రతిధ్వనిస్తూ, ఆ ప్రశాంతతను భయంభయంగా కదుపుతున్నవి.

"ఓ - చాలు చాలు - ఇకరండి, శవాన్ని పద్దాం."

బైరాగి గుంట నుండి పైకి వచ్చాడు. ముఖం తుడుచుకోకుండానే సాయం పడుతున్నాడు. సీతారాముడు చీకట్లోనే గోతిలోకి దిగాడు. వాళ్ళు అందిస్తూన్న శవాన్ని పట్టుకొంటూండగా ముఖం మీది చెరగు తొలిగిపోయింది. ఆ మనిషి టార్చిలైటు వేశాడు. ఆ కాంతిలో శవం ముఖం అస్ఫుటంగా కనిపించి-

"దుర్గా...." అన్నాడు సీతారాముడు. బరువవుతూన్న శవాన్ని అట్లాగే పట్టుకొని నిలబడిపోయాడు.

"ఎవరు?.... ఏమిటయ్యా అట్లాగే కొయ్యబారావ్? భయమా? అయిపోయిందిగదా?...."

సీతారాముడు బదులు చెప్పలేదు. శవాన్ని భద్రంగా నిద్రబుచ్చుతున్న శిశువును పండబెట్టినట్లు నెమ్మదిగా దించాడు. పైకి వచ్చి శాంతంగా పారతో మట్టి తోశాడు. అట్లాగే నిర్వేదంగా తనొక్కడే గొయ్యి పూడ్చాడు. అప్పుడే వీచిన గాలికి మర్రి ఆకులు కదులుతున్నై.

"రా పోదాం ఎక్కు" అని జీపు యజమాని అతడి వీపు తట్టాడు.

"నేనింటికి పోవటం లేదు. నన్ను రైలు స్టేషన్‌లో వదిలిపెట్టండి" అని మెల్లగా అన్నాడు సీతారాముడు.

అతని అభ్యర్థన విన్నాడో లేదో గాని జీపు మార్గం మళ్ళలేదు.

కాని, సీతారాముడి తిరుగుప్రయాణం మాత్రం మళ్ళీ ప్రారంభమైనది.

(స్వాతి మాసపత్రిక, 1984 ఫిబ్రవరి)